ఆధార్ అవస్థలు

- ఆధార్ కేంద్రాల చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణ
- సచివాలయాల్లో సమస్యలు పట్టించుకోని అధికారులు
- ప్రజలకు తప్పని తిప్పలు



నూజివీడులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లులు

నూజివీడు: ఆధార్ నంబర్.. నేడు ఏ చిన్న పనికైనా, సర్టిఫికెట్‌కైనా, రైల్వే టిక్కెట్ బుక్ చేసుకోవాలన్నా ఎంతో అవసరం. ఆధార్‌లో తప్పొప్పులను సరిచేయించుకోవడం నిరంతరం జరిగే ప్రక్రియ. ఈ నేపథ్యంలో జనాభాకు సరిపడా ఆధార్ కేంద్రాలు లేక రోజులతరబడి ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో సచివాలయాల్లో..

గత ప్రభుత్వం పలు సచివాలయాల్లో సైతం ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయగా చిన్నచిన్న సమస్యలతో ఆ కేంద్రాలు పనిచేయడం లేదు. అధికారులు వాటిని పరిష్కరించకుండా తమకేమీ పట్టనట్లు వదిలేయడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఆధార్ కార్డులోని పేరులో అక్షర దోషాలున్నా, అడ్రస్‌లు మార్చుకోవాలన్నా, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలన్నా, నూతన ఆధార్ కోసం నమోదు చేయించుకోవాలన్నా ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉండాలి.

పట్టణంలో ఏడు..పనిచేసేది ఒక్కటే..

నూజివీడు నియోజకవర్గంలో ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో 7 కేంద్రాలు ఉండగా పనిచేసేది ఒక్కటే. నూజివీడు పట్టణంలో నాలుగు ఆధార్ కేంద్రాలున్నాయి. వాటిల్లో సచివాలయాల్లో మూడు, యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, బ్యాంక్‌ఆఫ్ ఇండియా, పోస్టాఫీసులలో ఉన్నాయి. వీటిల్లో పోస్టాఫీసులో ఉన్న ఆధార్ కేంద్రం దాదాపు ఏడాది కాలంగా పనిచేయడం లేదు. అదేమిటని ఎవరైనా పోస్టల్ అధికారులను అడిగితే ఆపరేటర్ లేడనే సమాధానం వస్తోంది. యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాలు ఉన్నప్పటికీ ఆ కేంద్రాల్లో కేవలం ఆధార్‌తో ఫోన్ లింకు మాత్రమే అవుతోంది. యూనియన్ బ్యాంకులో ఆధార్ కేంద్రంలో నిర్వాహకురాలు అయితే వారం రోజులు సెలవు పెట్టడంతో అక్కడ ఆధార్ సేవలు నిలిచిపోయాయి. మూడు వార్డు సచివాలయాల్లో ఉన్నప్పటికీ అందులో రెండు సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదు. డివైస్‌లలో సాంకేతిక లోపం కారణంగా సేవలు నిలిచిపోయాయి. వాటిని అధికారులు చొరవ తీసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడితే చిన్నచిన్న సమస్యలను పరిష్కరించి కేంద్రాలు పనిచేసేలా చేయొచ్చు. అయినా అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు. దీంతో పట్టణంలో బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని ఆధార్ కేంద్రంలోనే అన్ని రకాల ఆధార్ సేవలు అందుబాటులో ఉండటంతో అక్కడ రద్దీ ఎక్కువగా ఉంటోంది.

విద్యార్థుల ప్రదక్షిణలు..

కేంద్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి 'అపార్' నంబరును ఇస్తోంది. దీనికి రిజిస్ట్రేషన్ అవ్వడానికి విద్యార్థి ఆధార్‌కార్డు కీలకమైంది. ఆధార్ కార్డులోని పేరులో అక్షరదోషాలున్నా, పుట్టినరోజు తేడా ఉన్నా, బయోమెట్రిక్ అప్‌డేట్ అవ్వకపోయినా ఆ విద్యార్థికి అపార్ క్రియేట్ కావడం లేదు. స్కూల్ యూ డైస్‌లో విద్యార్థి పేరు ఎలా ఉందో ఆధార్ కార్డులో కూడా అలా ఉంటేనే 'అపార్' నంబరు క్రియేట్ అవుతోంది. దీంతో పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటు విద్యార్థులు, అటు ప్రజల కష్టాలు తీరాలంటే పట్టణంలోని ఏడు ఆధార్ కేంద్రాలు పనిచేసేలా చూడాలని జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

నాలుగు రోజులుగా..



ఆధార్ కార్డులో పుట్టిన రోజు తప్పుగా ఉండటంతో 'అపార్' నంబరు జనరేట్ అవడం లేదు. పుట్టిన రోజును మార్పించుకునేందుకు నాలుగు రోజులుగా ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నా. రద్దీగా ఉండి రేపు రండి అంటూ ఏరోజుకారోజు చెప్తున్నారు. దీనికోసం తిరుగుతుంటే తరగతులు పోతున్నాయి.

– రేపాని అమూల్య, ఇంటర్మీడియెట్, ఆర్‌ఆర్‌పేట, నూజివీడు

బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం..



బయోమెట్రిక్ అప్‌డేట్ కాకపోవడంతో 'అపార్' నంబరు రావడం లేదు. దీంతో ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని కాలేజీలో చెప్పారు. దీంతో అప్‌డేట్ కోసం రెండు రోజులుగా తిరుగుతున్నా. చదువు పక్కన పెట్టి ఆధార్ అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్ర వద్దకు వస్తున్నా.

– పిన్నిబోయిన ప్రవీణ్, ఇంటర్మీడియెట్, సుంకొల్లు, నూజివీడు మండలం

నియోజకవర్గంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన



అభివృద్ధి కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం/జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలో సోమవారంఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ విస్తృతంగా పర్యటించారు. ముందుగా స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసుపత్రిలో ఎక్విప్‌మెంట్స్‌కు రూ.2 లక్షలు సొంత నిధులు అందజేశారు. అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా చారుగుండ్ల ప్రసాద్, డైరెక్టర్‌లుగా జల్లి కృష్ణ, షేక్ షెహనాజ్ బేగం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మండలానికి చెందిన ఆరుగురికి రూ.4.58 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించారు. మండలంలోని కీర్తిరాయునిగూడెం గ్రామంలో రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి రూ.1.82 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. జి.కొండూరు మండల పరిధి వెంకటాపురం గ్రామంలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాలు భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఆగిరిపల్లి: ఈదర ఎంపీటీసీ దొండపాటి సామేల్ తల్లి భారతమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఎంపీటీసీ సభ్యుడు సామేల్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. భారతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దన్నపనేని సత్యం బాబు, గొల్ల ఇస్సాకు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పామర్తి అనిల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

తిరువూరు: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం నాసిరకంగా ఉంటోందని, మెనూ ప్రకారం భోజనం సరఫరా చేయట్లేదని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే పాఠశాల డార్మెటరీ, వంటగది తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని, ప్రభుత్వం గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలూ కల్పిస్తోందన్నారు. భోజన సరఫరాలో నిర్లక్ష్యం చేయవద్దని ప్రిన్సిపాల్ కోటిరెడ్డికి సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు పలు సూచనలిచ్చారు.

న్యాయవాదులపై దాడులు అరికట్టాలి

మైలవరం: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని మైలవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం నిరసన తెలియజేశారు. మైలవరం బార్ అసోసియేషన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మైలవరం బార్ అసోసియేషన్ కార్యదర్శి వీటీ కిశోర్ మాట్లాడుతూ బెజవాడ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఓలనీ, ఘజియాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులపై పోలీసులు అమానుషంగా దాడి చేసి గాయపర్చిన సంఘటనపై పోలీసు వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి కిశోర్, సీనియర్ న్యాయవాదులు పావులూరి వెంకట శేషగిరిరావు, పజ్జూరు రామకృష్ణ, న్యాయవాదులు ఎం.ఆంజనేయులు, ఆర్ రమేష్‌బాబు, పీవీ సాంబశివరావు, ఎం.తనూజ్, శివ పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

మైలవరం: తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జే.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మండలంలోని మొర్సుమల్లి గ్రామంలో రూట్ వాచ్ చేయగా సీతారామపురం గ్రామానికి చెందిన మూడు అర్జున్ అను వ్యక్తి మోటార్ సైకిల్‌పై తెలంగాణ మద్యం రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని నుంచి మాన్షన్ హౌస్ బ్రాందీ 750 ఎమ్ఎల్ రెండు సీసాలు, నాలుగు హేవార్డ్స్– 5000 బీర్ బాటిల్స్, వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో మైలవరం ఎక్సైజ్ ఎస్సై ఎం.దుర్గాప్రసాదరావు, హెచ్‌సీలు కుమారస్వామి, నాగరాణి, కానిస్టేబుల్స్ రమేష్ సాయి, కృష్ణ, సర్వేష్, చెన్నకేశవులు, రాజకుమార్ పాల్గొన్నారని తెలిపారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా మేకల

తిరువూరు: పట్టణ సీపీఎం కార్యదర్శిగా మేకల నాగేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి సుందరయ్య భవన్‌లో జరిగిన పార్టీ పట్టణ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పంతంగి శ్రీనివాసరావు, బీ వెంకటేశ్వరరావు, ఆకుల రవి, మోటూరి చింతయ్య, షేక్ నాగుల్‌మీరా, కే వెంకటేశ్వరరావు, మరకాల రాము, చెరుకు సత్యనారాయణ, పంతంగి తులసీరాణి, చప్పిడి సురేష్ ఎన్నికయ్యారు. టిడ్కో గృహాలు పూర్తిచేసి పంపిణీ చేయాలని, దేవదాయ శాఖ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రిజిస్ట్రేషన్ చేయాలని, తిరువూరు పట్టణంలో ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలని, కృష్ణా నదీ జలాలను సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ నూతన కమిటీ తీర్మానించింది.

దరఖాస్తు చేసుకోండి

ఆగిరిపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు ఈనెల 6వ తేదీలోగా గడువు ముగియనుందని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. అర్హులైన వారు ఓటు హక్కు కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు 944 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు.

చార్జీలు రద్దు చేయాలి

మైలవరం: కరెంట్ బిల్లులపై సర్దుబాటు చార్జీలు ప్రభుత్వం రద్దు చేయాలని ఏపీసీసీ ఇన్‌చార్జిప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏడాదికిమూడుగ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇస్తూ కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీలతో మరోవైపు వాతలు పెడుతోందన్నారు. ఉచిత సిలిండర్‌ల పథకం కింద ఏడాదికి రూ.2,685 కోట్లు కాగా కరెంట్ బిల్లుల రూపంలో వసూలు చేసేది రూ.6 వేల కోట్లు అన్నారు. ఇంకా మూడు వేల కోట్లు ప్రజలపైనే అదనపు భారం పడుతోందన్నారు. దీనిపై ఈ నెల 6న ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసనచేపడతారని, 7,8 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో నిరసనలు ఉంటాయన్నారు.

శివాలయాల్లో కార్తిక పూజలు



బలివేలో రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



నూజివీడులోని కోట శివాలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు



శివలింగాకారంలో దీపోత్సవం

ముసునూరు: కార్తికమాస తొలి సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బలివేలోని ప్రసిద్ధ రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, త్రిలోచనుడికి అభిషేకం, విశేష పూజలతో, దీపార్చనలు చేశారు. ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఆటంకం లేకుండా సౌకర్యాలు కల్పించారు. చెక్కపల్లి, చింతలవల్లిల్లోని శివాలయాలు, భక్తాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. రమణక్కపేటలోని పార్వతీ సమేత శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేల్పుచర్ల, గుడిపాడు, గోగులంపాడు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు కుటుంబ సభ్యులతో కలిసిపూజలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

నూజివీడు: కార్తిక సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని శివాలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని కోట శివాలయం, బస్టాండు వద్ద ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు.

గంపలగూడెం: కార్తికమాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శైవాలయాల్లో త్రినేత్రునికి అభిషేకాలు నిర్వహించారు. గంపలగూడెం గంగా, పార్వతీ, భ్రమరాంబిక సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, గోసవీడు విశ్వేశ్వరస్వామి ఆలయం, కొత్తపల్లి ఉమాగౌరీ శంకర ఆలయం, మేడూరు జీవన ముక్తేశ్వర స్వామి ఆలయం, మేడూరు జీవన ముక్తేశ్వర స్వామి ఆలయం (1,116 శివలింగాల గుడి), భ్రమరాంబికా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, అర్లపాడు ఆంజనేయస్వామి ఆలయం, నెమలి శివాలయంలలో నిర్వహించిన కార్యక్రమాలలో పరమేశ్వరునికి పంచామృతాలంతో అభిషేకం విశేష పూజలు చేశారు. ఊటుకూరు రామాలయంలో కార్తికమాసం సందర్భంగా స్వస్తిక్ ఆకారంలో దీపాలు వెలిగించారు.

తిరువూరు: కార్తిక మాసంలో మొదటి సోమవారం నాడు తిరువూరులోని పలు దేవాలయాల్లో జరిగిన విశేషపూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీగౌరీ కేదారేశ్వరాలయాల్లో తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి విశేషాలంకరణ చేశారు. ఉపవాస దీక్షలు నిర్వహించిన మహిళలు ఆయా ఆలయాల్లో ఆకాశ దీపాలు వెలిగించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక సత్రం సెంటర్లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాసుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా భక్తులు సాయంత్రం శివలింగాకారంలో దీపార్చన నిర్వహించారు. శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి కొండపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మెట్ల కోనేరు వద్ద గల బాలా త్రిపుర సుందరి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో, ఈదులగూడెం నాగేశ్వర స్వామి ఆలయంలో పరమేశ్వరునికి మహిళలు పూజలు చేశారు.

విస్సన్నపేట: స్థానిక గంగా పార్వతి సమేత చంద్రశేఖరస్వామి(శివాలయంలో) కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శివాలయంలో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయ చైర్మన్ వెంపటి శ్రీక్రిష్ణ జనార్ధనరావు దేవాలయం వద్ద భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలో పలు శివాలయాలు, దేవాలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు.

మీకోసం అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

ఆర్డీఓ మొవిడి వాణి



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ మొవిడి వాణి

నూజివీడు: మీకోసం కార్యక్రమంలో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ మొవిడి వాణి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం 'మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 13 అర్జీలు రాగా వాటిని ఆయా శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. దేవరగుంటలోని పెద్ద చెరువు నుంచి మట్టిని అక్రమంగా తవ్వి ట్రాక్టర్లతో తోలి అమ్ముకుంటున్నారని గ్రామస్తులు అర్జీని అందజేశారు. జంగంగూడెంలో చెరువులో మట్టిని అక్రమంగా తవ్వడమే కాకుండా తన పొలంలోకి వెళ్లేందుకు ఎల్లంకి సత్యన్నారాయణ అనే అతను వాగును పూడ్చుతున్నారని, దీనివల్ల పొలాలు ముంపునకు గురవుతాయని, చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అర్జీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కర రెడ్డి, సీడీపీఓ ఎస్వై నూరాని, డీఎల్‌డీఓ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరు

వారానికొకసారి నిర్వహించే 'మీకోసం' కార్యక్రమానికి ఎక్కువ మంది అధికారులు గైర్హాజరవుతున్నారు. అధికారులు రాకుండా కార్యాలయ సిబ్బందిని పంపుతున్నారు. దీని వల్ల ప్రజల సమస్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం లేకుండా పోతోంది. సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమానికి డీవైఈవో, డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, పశుసంవర్ధకశాఖ, డీఎల్‌పీఓ, అటవీశాఖ, వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖల అధికారులు హాజరవ్వకుండా వారి సిబ్బందిని పంపించడం గమనార్హం.

'ఫైర్' సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు: ఫైర్ స్టేషన్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి మీ పరిధిలో ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు వెంటనే స్పందించాలని అగ్నిమాపకశాఖ అడిషనల్ జాయింట్ డైరెక్టర్ (నార్త్ రీజియన్) జీ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అగ్నిమాపక కేంద్రం వసతులు, సౌకర్యాలు తదితర వాటిని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు మండలాల పరిధిలో చివరి ఊరుకు దూరం ఎంతనే వివరాలను ఫైర్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు,ఆసుపత్రులు, సినిమాహాళ్లు, కల్యాణ మండపాల నిర్వాహకులుఫైర్‌నిబంధనలను పాటించేలా తనిఖీ చేయాలన్నారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ దేవరపల్లి మత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

రైతు సంఘం డిమాండ్



కవులూరు సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

జి.కొండూరు: రైతులు, కౌలురైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు మేరకు మండలం పరిధి కవులూరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. జమలయ్య మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారన్నారు. కానీ సాయం అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో భారీ వరదల వల్లన పంటలు దెబ్బ తిని రైతాంగం ఆర్థికంగా నష్టపోయారన్నారు. వీరికి అందిన పరిహారం నామ మాత్రమేనన్నారు. ఖరీఫ్ సీజన్లో తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను రద్దు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు బుడ్డి రమేష్, రైతు నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు: రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం రైతులతో కలిసి వినతిపత్రాలను అందజేశారు. ప్రభుత్వమే పంటల బీమా సొమ్మును చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, నిమ్మగడ్డ నరసింహా, మడుపల్లి నాగేంద్రరావు, రాంబాబు, మూడగాని సుధాకర్, నక్కా మహాలక్ష్మణుడు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంహామీని నెరవేర్చలేక పోయిందని అన్నారు. చిన్నంపేట గ్రామంలో 1980లో పేదలకు ఇచ్చిన భూములకు శాశ్వత హక్కు కలిగించాలని డిమాండ్ చేశారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ విస్సంపల్లి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. పుచ్చకాయల రామచంద్రారెడ్డి, తల్లాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ముసునూరు, చెక్కపల్లి, లోపూడి, రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, వలసపల్లి గ్రామ సచివాలయాల్లో రైతులకు పెట్టుబడి సాయం అందించాలని వినతిపత్రాలు అందజేశారు. మండల రైతు సంఘ నేతలు చెంగల వెంకటేశ్వరరావు, కూచిపూడి నాగేశ్వరరావు, మల్లవల్లి మన్మధరావు, కొక్కెరపాటి ఆనంద్, పామర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.2.19 కోట్లు

తిరువూరు: భారీవర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు తిరువూరు ఆర్ అండ్ బీ సబ్‌డివిజన్లో రూ.2.19 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కే శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం తిరువూరు–మధిర ఆర్ అండ్ బీ రహదారికి రూ.15 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. 30 రహదారులను వెంటనే మరమ్మతులు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

కుట్టు మిషన్ల పంపిణీ

తిరువూరు: విశ్వబ్రాహ్మణుల్లో పేదలకు సహాయం అందిస్తామని శ్రీనివాసనిలయం చారిటీస్ వ్యవస్థాపకులు కటకం శ్రీనివాసాచారి అన్నారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణ శివారులోని మామిడితోటలో కార్తిక వనసమారాధన జరిగింది. సమావేశంలో కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. సంఘ అధ్యక్ష కార్యదర్శులు చామర్తి రాంబాబు, పమ్మి బ్రహ్మాచారి, గౌరవాధ్యక్షుడు తూముల సూరిబాబు, వ్యవస్థాపకుడు తూమాటి రమేష్, కోశాధికారి తరుమణి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు రామడుగు శ్రీనివాసరావు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలి

మైలవరం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మైలవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాదు శ్రీనివాసరావు, ధరణికోట వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మైలవరం సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు మాట్లాడారు. భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను గత ప్రభుత్వం మెమో నంబర్ 1214 ఇచ్చి ఆపిందన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం బోర్డును పనిచేయించి పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి తమ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ప్రకటించిందన్నారు. అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఐదు నెలలు గడుస్తున్నా దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ 8న అన్ని పట్టణాలు, మండల కేంద్రాలలో ఆందోళన చేసి తహసీల్దార్లకు, లేబర్ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని బిల్డింగ్ వర్కర్స్ (సీఐటీయూ) ఎన్టీఆర్ జిల్లా కమిటీ నిర్ణయించిందని తెలిపారు.

8 నుంచి ట్రూఅప్ చార్జీలపై సీపీఎం నిరసన

మైలవరం: అధిక ధరలు, ట్రూఅప్ చార్జీలపై సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, రాష్ట్రం పట్ల కేంద్రం ప్రభుత్వం చూపుతున్న వివక్ష, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ఇసుక కొరతతో పనులు లేక కార్మికులు పడుతున్న ఇబ్బందులపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేస్తామన్నారు. కరపత్రాలు పంపిణీ చేసి ప్రజల్లో చైతన్యం కలిగించి ప్రభుత్వ విధానాలను ఎండగడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రావూరి రమేష్, రావుల సుబ్బారావు, ఇసాక్ పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

నూజివీడు: పట్టణంలోని కోర్టు భవనాల ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ ప్రారంభించారు. దంత వైద్యులు స్ఫూర్తి, కే రాజేష్, రచన న్యాయవాదులకు దంత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, సెక్రటరీ మడుపల్లి మధు రవిశంకర్ పాల్గొన్నారు.

మండల సమావేశం రేపటికి వాయిదా

విస్సన్నపేట: మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం నిర్వహించవలసి ఉండగా బుధవారానికి వాయిదా వేసినట్టు ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు సోమవారం తెలిపారు. వెలుగు కార్యాలయం మీటింగ్‌హాలులో ఆ రోజు ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే కె శ్రీనివాసరావు హాజరవుతారని ఎంపీడీఓ తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

వాడపల్లికి ప్రత్యేక బస్ సర్వీసు

తిరువూరు: ఈ నెల 8న తిరువూరు నుంచి వాడపల్లికి బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తెలిపారు. 8న రాత్రి 9.30 గంటలకు తిరువూరులో బయలుదేరి పుట్రేల, విస్సన్నపేట, కామవరపుకోట, కొవ్వూరు మీదుగా వాడపల్లికి తెల్లవారు జామున 3 గంటలకు చేరుతుందని తెలిపారు. తిరిగి ఉదయం 8 గంటలకు వాడపల్లిలో బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు తిరువూరు చేరుతుందన్నారు. రానుపోను టికెట్ ధర రూ.810గా నిర్ణయించామని, ఆన్‌లైన్లో రిజర్వేషన్ చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. ప్రతి శుక్రవారం ఈ బస్సుసర్వీసు ఉంటుంది. వివరాలకు 98856 61835 నంబరులో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తిరువూరు: ఇబ్రహీంపట్నం– జగదల్‌పూర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఏకొండూరు మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బొల్లెపోగు స్వామి తిరువూరులోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న కుమార్తె శశాంకిత, కుమారుడు శ్రీరాజ్‌శశాంక్‌లను ద్విచక్రవాహనంపై స్వగ్రామమైన పోలిశెట్టిపాడు తీసుకెళుతుండగా ఎదురుగా మినీ వ్యాను ఢీకొంది. గాయపడ్డ ముగ్గురినీ తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

విద్యుత్ మోటారు చోరీ

జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి అవసరాలకు వినియోగించే విద్యుత్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఎత్తుకెళ్లారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రమేష్ సోమవారం జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అన్నవరం వద్ద లారీ బోల్తా

నూజివీడు: అన్నవరం వద్ద సోమవారం లారీ బోల్తా పడింది. నూజివీడు వైపు నుంచి అన్నవరం వద్ద ఉన్న అట్టల ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది.డ్రైవర్ లారీలో నుంచి దూకేయడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com